## 6. విరాల్ మిండ నాయనారు

విరాల్ మిండ నాయనారు పర్వతప్రాంతమైన శీంగునూరు లో జన్మించారు. వెల్లాల కులజుడు. అత్యంత శివభక్తుడు. ఆ భక్తి ప్రపత్తిలో 'నేను' 'నాది' భావాలను అధిగమించాడు. సమత్వ దృష్టి అలవడింది.

శివభక్తులయెడ గౌరవము, శివభక్తుల సేవ - పరమశివుని అర్చనతో సమానమని అంతేకాదు కొంచెము ఎక్కువేనని, ఎంతటి శివోపాసకుడైనను శివభక్తులను కించిత్ అగౌరవపరచిన వారు ముక్తికి దూరమవుదురని భావించేవాడు. అనుదినము శివాలయమున కేగుట అతని దైనందిక కృత్యము. దేవుని ఆరాధించే ముందు - అక్కడ ఏ శివ భక్తుడున్నను అతనిని సేవించిన తర్వాతనే శివార్చన గావించేవాడు.

తీర్థయాత్ర చేయనుత్సహించి శీంగునూరును విడిచి తిరువారూరు చేరుకొన్నాడు. ఒక రోజున దేవుని అర్చించుచుండగా సుందరమూర్తి నాయనారు ఆ దేవళమునకు విచ్చేసి అచ్చట నున్న భక్తులను దాటుకుంటూ గర్భగుడిలోనికి వెళ్లాడు. విరాల్ మిండ నాయనారుకు ఇది గర్హనీయమనిపించింది. భక్తులను దాటి వెళ్లుట అపరాధముగా భావించాడు. సుందరారుతో నీవు శివభక్తులను కించపర్చావు. అందుచే పరమ పవిత్రులైన శివభక్తులమధ్య నీవుండదగవు అందుకని నిన్ను వెలివేస్తున్నాను అంటూ, శివునిగూడ నుద్దేశిస్తూ - శివా - నీవు అనాలోచితముగ సుందరారు అర్చన పరిగ్రహించావు. అందుకని దైవములలోనిన్నుగూడ వెలివేస్తున్నాను అని తన కోపము వెళ్లగక్కాడు. ఆ విరాళ్ మిండ నాయనారు పరమభక్తి శివునిగూడ మందలించ గలిగింది.

ఒక విధముగ ఇది గూడ శివసంకల్పమే. శివభక్తులయెడ ఎంత గౌరవ భావముండవలయునో అందఱకు తెలియ బరచ గలందులకు అతని చేత శివుడట్లా అనిపించాడు.

సుందరమూర్తి నాయనారు శివునియెడ, శివభక్తులయెడ విరాళ్ మిండార్ యొక్క మనోభావాల్ని అర్థము చేసికొని - అతనికి సాష్టాంగ పడి - ఆయనను ప్రశంసిస్తూ

ఒక పడిగమును పాడాడు. ఈ పడిగముతో విరాల్ మిండార్ హృదయము కరిగింది. సుందరారుకు వందనము చెబుతూ - "శివభక్తుల యెడ మీ మనసుకు సరియైన దృక్వ ధము కలిగింది. వారి ఎడ మీ గౌరవము నిరుపమానము" అని పలికాడు.

ఈ విధంగా భగవంతుడు విరాల్మిండ నాయనారు గొప్ప తనమును అందరికీ తెలియ బరచగలిగాడు.

పరమశివుడు విరాల్ మిండ నాయనారును తన లోకంకు తీసికొని వెళ్లి శివ గణాలకు అధిపతిగా చేశాడు.

****